ఎదురుగుమ్మాలు

[కథానిక]

●

శ్రీ పిలకా గణపతిశాస్త్రి

ప్రాతఃకాలంనీరెండ ఆ భవంతిముందు వేళ్లాడగట్టిన కొత్త వరివెన్నుల గుత్తులమీద పడి, క్రమంగా పసిరిపచ్చికమీద పాకిపోతూంది. ఆ నీరెండలో వరివెన్నులకోసం వచ్చే పిచ్చుకలుతళతళా మెరిసిపోతూ, వెన్నులతో తిరిగి పోతున్నాయి. రంగు రంగుల సీతాకోకచిలుకలు పచ్చికమీదనించి బంతిపూలమీదా, ఎర్రగోరింటలమీదా పచార్లు ప్రారంభించాయి. ఇరుగుపొరుగు చిన్నపిల్లలంతా ఆ భవంతిగుమ్మం ముందు ఆడుకుంటున్నారు.

పదిపన్నెండేళ్ల పిల్లలు చెమ్మచెక్క ఆడుతున్నారు. మరీ చిన్నపిల్లలు లక్కపిడతలతో బువ్వాలాట లాడుతున్నారు. ఆ వేళ అక్కడ అంతమంది చిన్నపిల్లలు చేరడానికి కారణం లేకపోలేదు. ఆ సంవత్సరం ఆయింట్లో బొమ్మలుపెట్టారు. బొమ్మల పూజ కనివచ్చిన ముత్తైదువలతో పిల్లలు కూడా వెంటపడి అక్కడ జేరుకున్నారు.

క్రమంగా ముత్తైదువలు కొంతమంది బొమ్మలకు పెంద్రాళే నైవేద్యాలు పెట్టి తీయని సన్నకంఠాలతో మంగళహారతులు పాడుతున్నారు. కొంతమంది పెళపెళలాడే చీరలతోను, గలగలలాడే నగలతోను ఒయ్యారంగా నడుస్తూ, పిల్లల్ని వెంటబెట్టుకుని నైవేద్యాల పళ్లాలతో తిరిగిపోతున్నారు.

క్రమంగా నీరెండ బంతిపూలరంగుల్లో కలిసిపోతూంది. కలకల నవ్వే పరిహాసకంఠాలలో ఒక ముగ్ధబాలిక 'చేమంతి పువ్వంటి చెల్లెలినియ్యావే, బంతిపువ్వంటి బావ నియ్యావే, మొగలిపువ్వంటి మొగుణ్ణి నియ్యావే.' అని కులాసాగా పాడుతూ తిరుగుతూంది. మిగిలిన పిల్లలు ఆమెతో తిరుగుతూ, ఆఖరి చరణం కలిసి పాడేటప్పుడు చిరుసిగ్గులతో తలలు వంచుకుని మెల్లిగా మెల్లిగా గిరగిరా తిరుగుతున్నారు. వారి కంఠాలలోనించి వెలువడే ఆ పాటసవ్వడి ఆ పరిసరం అంతా ఒక చిత్రమైన కలగా మార్చేసింది.

ఇంతలో అక్కడ ఆడుసనే పిల్లల్లో ఒక పసి గొంతుబారుమని ఏడ్చింది. దాంతో ఆ ముట్టూ పాటలూ, పరిహాసాలూ క్రమంగా తగ్గుతూ ఆగిపోయాయి.

నగల భారంతో నడవలేక తూలుతూన్న ఒక ముత్తైదువు లోపలినించి తటాలున అక్కడికి వచ్చి 'ఎవరే ఆ మేడుపూ?' అంది. 'అమ్మగోరండీ, మరేమోనండి— మాట్టరుగోరమ్మాయి— మనబ్బాయిగార్ని గిల్లేసుందుండి' అంది, ఆ పిల్లాణ్ణి ఆడించే తూర్పుపిల్ల. తల్లి కంగారుపడుతూ 'చూశావా అమ్మా, పిల్లాడి బుగ్గ ఎల్లా చీరుకుపోయిందో. అయ్యో, అయ్యో, పిల్లాడు గుక్క తిప్పగో లేకపోతున్నాడే, ఎంత పని జరిగిందే ఈ వేళ. ఏమే! అమ్మణ్ణీ! ఇలా గేనా పిల్లాణ్ణి రక్తాలొచ్చేట్లు గిల్లెయ్యడం.' అని గదమాయించింది.

అంతవరకూ బిక్కమొహంతో తెల్లబోయి చూస్తూన్న అమ్మణ్ణి 'నేనుకాదు...వాళ్ల చిట్టి...' అని పెద్దగా భయపడుతూ చెప్పింది. ఇంకా ఏదో చెప్పబోయి, ఆమాట పూర్తిచెయ్యకుండానే గోలుగోలున ఏడవడం మొదలుపెట్టింది.

ఆ చిట్టి ఎంత చూచినా ఆ పరిసరాల్లో ఎక్కడా కనబడలేదు. ఏమయిందో మరి. ఆపిల్లవాడి బుగ్గమీద మాత్రం గోరుదిగినంతమేరా రక్తపుజీర కనబడుతూంది. వాడు తల్లిని చూచి మరీ బిగ్గరగా ఏడవడం మొదలుపెట్టాడు.

'చూడు, పిల్లాణ్ణి రక్కేసి అమ్మకొత్తిలా ఎల్లా రాగాలు పెడుతూందో. గొంతుకుంటే సరి' అని గద్దించింది పిల్లవాడి తల్లి.

ఇంతలో అమ్మణ్ణితల్లి కనకమ్మ అంగలు వేసుకుంటూ అక్కడికి వచ్చి, రుసరుసలాడుతూ—

'నరసమ్మగారూ, మీ సుబ్బల్ని మాపిల్ల కాదుటమ్మా గిల్లుతా! వాళ్ల చిట్టిట.' అంది.

నరసమ్మ అందుకుంది—

'అదేమిటమ్మా అలా అంటావు? వాళ్ల చిట్టి ఇక్కడ లేందే. సత్తీ, ఎవరే గిల్లుతా?'

'అమ్మణ్ణిగోరేనండి.'

'ఆ, నువ్వు చూశావులే భడవా!' అని రొక్కాయించింది కనకమ్మ.

'నాను సూశానండి, నిజమేనండి, అమ్మగోరు.' అంది సత్తి భయపడుతూ.

కనకమ్మరొక్కాయింపుతో నరసమ్మకు కోపమూ, ఉడుకుబోతుతనమూ ఒక్కసారిగా కళ్లకెక్కాయి. ఆమె ఉక్రోషం ఆపలేక సత్తికేసి తిరిగి, 'పిల్లాణ్ణి కనిపెట్టుకుని ఉండవే అంటే, నువ్వేం చేస్తున్నావే' అని చేతికొద్దీ బుగ్గలు మెలిపెట్టింది. 'సూత్తానే ఉన్నానండి, అమ్మగోరూ' అని ఏడుస్తూ సత్తి సమాధానం చెప్పింది. అయితేనేం సత్తివీపుమీద మణుగంత అణుపు పడింది. ఆ అణుపుతో సత్తి ముందుకు తూలిపోవలసిందే. అయినా అది ఎల్లాగో కాళ్లు నిలదొక్కుకుని ఏడుస్తూన్న పిల్లాణ్ణి ఎత్తుకుని తనుకూడా ఏడుస్తూ నిలబడింది.

'అయ్యగారు రానీ నీ పని పట్టిస్తా' అని మళ్లీ బుగ్గలు నులుము బోయింది నరసమ్మ. సత్తి దిక్కు లేని దానిలా బారుమని ఏడుపు మొదలెట్టింది. నరసమ్మ సత్తిమీదకు వచ్చి 'నోరు మూస్తావా ముయ్యవా.' అని కళ్లెర్రజేసింది. సత్తి నోరుమూసుకుని లోలోపలే కుమిలిపోయింది. సుబ్బులు ఈ కేకలతో మరింత గట్టిగా బారుమన్నాడు.

కనకమ్మ మళ్లీ అందుకుని 'అదేమిటమ్మా, అనవసరంగా దాన్ని కొట్టుకుంటారు. వాళ్ల చిట్టి గిల్లేసి పారిపోయిందిలా ఉంది.' అంది. నరసమ్మ దీనితో గుగ్గిలం వేసిన అగ్గిలా అయిపోయి—

'మీ పిల్ల నేమీ అనలేదమ్మోయ్ నేను. మధ్యన అనవసరంగా మీరు కలగజేసుకోకండి.' అంది కనకమ్మ. 'కలగజేసుకోడానికే ముందమ్మా ఇందులోను? మా పిల్ల కాదమ్మా గిల్లింది, వాళ్ల చిట్టి అన్నాను. ఇంతేనా. ఇందులో తప్పేముంది? మీరల్లా మొహం చెండుకోడానికి!' అంది.

నరసమ్మకి ఆ కోపంలో స్మారకం తప్పిపోయింది. ఆమె కనకమ్మమీదికి మీదికి వెడుతూ 'మీ తప్పేమీ లేదమ్మోయ్. తప్పంతా మాదే. ఈ తంపిలన్నీ పడలేకే నేను మా అత్తగారితో 'ఈ యేడు మన ఇంట్లో ఈ బొమ్మలు పెట్టించవద్దండి మహారాజా' అని వెయ్యివిధాల పోరాను. నా మాట చెవినిపెట్టిందా ఆవిడ? అసలు ఒకప్పుడు చెవిపెట్టిందా ఏమిటి? ఎప్పుడూ నా బతుకిల్లాగే వెళ్లింది' అని ఇంకా ఏవేవో సణుగుకుంది.

దానిమీద కనకమ్మ 'మీ కంత కష్టమెందుకమ్మా. ఈసారితో బాగా బుద్ధి వచ్చింది. ఇంక మీ యింట్లో అడుగుపెట్టంలెండి' అని గిరుక్కున వెనక్కి తిరిగింది. కాని అమ్మణ్ణి అక్కడ కనబడలేదు. ఆమె కూతుర్ని పిలుస్తూ 'ఓఅమ్మణ్ణోయ్. ఎక్కడ అణగారిపోయావే? నీతో పడలేకుండా ఉన్నానే మామ్మ... నేను ఎక్కడికి వెడితే అక్కడికి నాతో దిగమారిపోవాలిగదా...అబ్బబ్బా! నే నీ పిల్లలతో పడలేకుండా ఉన్నానమ్మా...అయినా ఒక్కనిమిషం పిల్లల్ని చూడండి అంటే తమర్ని కానట్టు మాట్లాడకూరుకుంటారు. కాస్త శనివారాదివారాలు వచ్చాయంటే పొద్దస్తమానం పేకాటతో సరి. ఎన్నేళ్లు వస్తే యేం? మనుషులకి కాస్త జ్ఞానమంటూ ఉండాలిగాని' అని తనకి అలవాటయిన ధోరణిలో పడింది.

ఇంతలో పొరుగింటి పెద్దముత్తైదువ ఒకావిడ అక్కడికి వచ్చి 'ఊరుకోండమ్మా ఊరుకోండి. ఇంతకీ ఏముందని ఈ తగాదా? పిల్లలూ పిల్లలూ ఆడుకునే

టప్పుడు కొట్టుకోనూ కొట్టుకుంటారు, తిట్టుకోనూ తిట్టుకుంటారు. ఇంతమాత్రానికే ఇదయిపోతే ఎలాగ? మీరేమయినా పరాయివాళ్లా ఏమన్నానా. కొద్దో గొప్పో కావలసినవాళ్లే ఆయిరి. అదీగాక తెల్లారిలేస్తే ఎదురుగుమ్మాలు. వారింటికి వీరూ రావాలి, వీరింటికి వారూ వెళ్లాలి. తప్పమ్మా. నోములు మానుకోకండి' అంది.

ఈ హడావిడి అంతా అంచీలమీద లోలోపలి తులసికోటదగ్గర పూజచేసుకుంటూన్న నరసమ్మఅత్తగారికి తెలిసిపోయింది. ఇంటికంతా ఆమే పెత్తనదారిణి ఆయిరి. ఆమె ఊరుకుంటుందా? జారిపోతూన్న బట్ట చెవులమీదికి సవిరించుకుంటూ గబగబా అక్కడికివచ్చి కనకమ్మని బతిమాలుకుంటూ—

'ఏమిటోనమ్మా, మా కోడలు అనే మాటలకి లెక్కేమిటి? నువ్వేమీ అనుకోకమ్మా. కోపం వస్తే అసలది నన్నే తీసేస్తుంది. దాని ధోరణే అంత. ఇంతకీ—ఇంటికి పెద్దదాన్ని నేనా? అదా? తెలిసీ తెలియనిదాని మాటలు పట్టుకుని తప్పట్టుకుంటే ఎలాగ...ఏడాదీ రెండేళ్లూ కాదమ్మా ఇది, తొమ్మిదేళ్ల నోము. కనీపెంచీదానవు. ఇల్లాగ మధ్యన మానేస్తే ఎప్పటికి ఉద్యాపనకాను. నా మాట వినమ్మా. మీ అమ్మ ఓటే నేనోటేకాదు. నోము మానుకోకమ్మా. కాస్త ఈవేళకు ఎల్లాగో అల్లాగ కాలక్షేపం చేసుకో అమ్మా! నైవేద్యం పెట్టిపో. ఈ కాస్సేపూ కళ్లు మూసుకుంటే సాయంత్రం వాల్లాడింపే ఆయిరి' అంది.

దానిమీద కనకమ్మ కొంచెం శాంతించింది. కాని లోలోపలి ఉక్రోషం అంతా వెళ్లబోస్తూ—'వర్ధనమ్మత్తా, అసలు సంగతంతా విని, నావల్ల తప్పుంటే నన్నేమన్నా అను, పడతాను. ఇంతకీ మా పిల్ల కాదమ్మా కొట్టింది, వాళ్ల పిల్లమ్మా అన్నాను. అంతేనా అంతకంటే ఏమన్నా అన్నానా. అంత మాత్రానికే ఇంత రంధి చెయ్యాలా? భాగ్యభోగ్యాలుంటే చెయ్యి ములగా జార్రుకుంటారు. ఒకళ్లకి పెట్టేదీ పోసేదీ ఏముంది? మేమేమీ గడవక ఇక్కడికి రాలేదుగదా. మాకు భగవంతుడిచ్చినదానితో—కలో గంజో తాగి బతుకుతాము. అంతేగాని చచ్చిపోం గదా' అంది.

వర్ధనమ్మ—'తప్పు తప్పమ్మా. శుభమల్లే పండుగ రోజుల్లో అవేం మాటలు? నాకు తెలియకడుగుతాను గాని, ఇందులో మేము మీకు పెట్టేదీ పోసేదీ ఏముందే? నలుగురూ నాలుగు బొమ్మలు తెచ్చుకుని ఒకచోట పెట్టుకున్నారు. వాళ్లవాళ్ల పూజలూ పునస్కారాలూ వాళ్లు చేసుకున్నారు. అంతేనా? కాస్త ఇంటికి దగ్గిరగా ఉందిగదా అని ఈఏడు బొమ్మలు ఇక్కడే పెట్టుకున్నావు. ఇదేమన్నా మాయింట్లో పెళ్లిటే వెర్రదానా. నామాటలు విని ఈకాస్సేపూ ఎల్లాగో అల్లాగ కాలక్షేపం చేసుకో అమ్మా'! అంది.

దానికి కనకమ్మ ఏమీ సమాధానం చెప్పలేదు. కాని పేరంటాళ్లలోంచి నరసమ్మ కళ్లమ్మట నీళ్లతో అత్తగారికి ఎదురుగుండా వచ్చి నిలబడి, 'అసలు ఈ రంధి అంతా నన్ను యాగీచెయ్యడంకోసమే వచ్చింది. నేను మిమ్మల్ని ఎప్పుడైనా పల్లెత్తుమాటన్నానా? నన్నెందుకిల్లాగ నలుగురినోళ్లలోనూ పడేస్తారు' అని బుడిబుడిదీర్ఘాలు తియ్యడం మొదలుపెట్టింది.

అత్తగారు కోడలుచెయ్యి పట్టుకుని బలవంతంగా లోపలికి లాక్కుపోతూ, చా'ల్చాలులే నేర్చావు. గుమ్మంలోకి ఇరుగూ పొరుగూ వస్తే ఇలాగేనా మర్యాద చెయ్యడం? నడు నడు. లోపలి కీపాటికి.' అని కూకలేసింది. అత్తాకోడళ్లిద్దరూ అక్కడినించి వెళ్లిపోవడంతో ఆ గాలిదుమారం ఆసమయానికి శాంతించింది. ఇరుగూపొరుగూ ఎవరికితోచినవి వారు అనుకుంటూ తమతమ ఇళ్లకి వెళ్లిపోయారు.

ఆతరవాత ఆ తల్లులిద్దరిమధ్యా ఉండే ఎడం ఎక్కువైనది గాని తగ్గలేదు. కనకమ్మ ఇక నరసమ్మగారి గుమ్మం తొక్కనని పట్టుపట్టుకుని కూర్చుంది. కాని నరసమ్మఅత్తగారు వచ్చి కాదుకూడదని బతిమాలడంవల్లా, తన అత్తగారిచేత చెప్పించడంవల్లా విధిలేక సాయంత్రం వాల్లాడింపుకి వెళ్లడానికి అంగీకరించింది. అందుచేత అంటీఅంటనట్టు బొమ్మలకు పూజచేసి నైవేద్యంపెట్టి వెళ్లిపోయింది. అమ్మణ్ణి కూడా మళ్లీ వెంటబడింది కాని రానివ్వలేదు.

సాయంత్రం అయేసరికి బొమ్మల వాల్లాడింపులోకని అంతా తయారయ్యారు. అమ్మణ్ణి కొత్త పరికిణీ, కొత్త చొక్కా తొడుక్కుని వాల్లాడింపుకి వస్తానని ఏడ్చింది. తల్లి మొదట ససేమిరా వల్లకాదంటే వల్లకాదంది. కాని వాల్లాడింపంటే పిల్లలందరికీ పెద్ద సరదా. వాళ్లు మానమంటే మానతారు కనకనా. చివరికి అత్తగారి బలవంతంవల్ల అమ్మణ్ణిని తీసుకువెళ్లడం తప్పలేదు. తల్లి అమ్మణ్ణితో 'ఈసారి వాళ్ల సుబ్బులతో ఆడి చూడు నిన్నేం చేస్తానో' అని బెదిరించింది. అమ్మణ్ణి

ఉలక్కుండా పలక్కుండా తల్లివెనకాలే వాల్లాడింపులోకి వెళ్లింది.

బాజాభజంత్రీలతో బొమ్మల ఊరేగింపు బయలుదేరింది. పేరంటాళ్లంతా ఒకళ్లొకళ్ల మీద బుక్కాలు జల్లుకుంటూ పెద్దకాలవవ్వయిపు నడిచిపోతున్నారు. సాయంకాలం నీరెండలో బుక్కారంగు ఎర్రమతాబావెలుగులా కనబడింది. పిల్లవాణ్ణి ఎత్తుకున్న సత్తీ, నరసమ్మాకూడా ఊరేగింపులో ఉన్నారు. నరసమ్మా కనకమ్మా ఒకరొకర్ని చూసుకుని ఎడమొహాలూ, పెడమొహాలూ పెట్టుకుంటూ నడిచి వెళ్లారు.

కనకమ్మ నరసమ్మకేసి కన్నెత్తి చూడలేకపోయింది. అసలా ఊరేగింపులో ఆమెతో కలిసి నడవడమే తనకొక చిన్నతనంలా కనబడింది. అయితే తప్పనిసరి అవడంవల్ల నరసమ్మకి దూరదూరంగా నడిచి వెళ్లింది. ఇప్పుడిక ఏమనుకుంటే ఏం లాభం!

ఉత్సవం పిల్లలతోను, పెద్దలతోను, మెల్లిగా ఊరికి దగ్గరగా ఉన్న పెద్దకాలవగట్టుకి చేరుకుంది. అప్పుడే సూర్యాస్తమానం కాబోతూ ఉంది. నిశ్చలంగా ప్రవహిస్తూన్న కాలవలో చిన్నచేపలు ఎగిరి పడ్డప్పుడల్లా సూర్యకిరణాలు తళతళా ప్రతిఫలిస్తున్నాయి. కాలవలో చెట్లనీడల్లో పడవ ఒకటి తెరచాపతో నీళ్లు తాగుతూ తాజేలులా తేలిపోతూంది. పశువులు అవతలి వొడ్డునించి మెల్లిగా ఈదుకుంటూ వస్తున్నాయి. ముత్తయిదువలు పూజచేసిన బొమ్మలు కాలవ నీళ్లల్లో కలుపుతున్నారు. బొమ్మలు కలిసిన నీళ్లల్లో పసుపు కుంకుమలు చిత్రమైన రంగులుగా చెదిరిపోతున్నాయి. దొన్నెల్లో ఉంచిన దీపాలు సంధ్యానక్షత్రాలలా నీళ్లలో తేలిపడుతున్నాయి.

కొందరు ముత్తయిదువలు పోకదొన్నెలతో అక్కడ ఉన్న పిల్లలకీ, పెద్దలకీ ప్రసాదాలు పంచిపెడుతున్నారు. లోలోపల ఉక్రోషాలవల్ల తల్లులిద్దరూ ఒకరికొకరికి ప్రసాదాలు పంచిపెట్టుగోలేదు. ప్రసాదాలు పంచిపెట్టినతరువాత తల్లులు తమ పిల్లల్ని వెంటబెట్టుకుని ఇళ్లకి వెళ్లిపోతున్నారు. కనకమ్మ అమ్మణ్ణికోసం చూసింది. కనబడలేదు. తన కనుకప్పి అప్పుడే ఎక్కడికి వెళ్లిందో అని ఆమె ఆశ్చర్యపోయింది. మళ్లీ ఇంతలోనే అది ఏంతగాదాలు తెస్తుందో అని ఆమెకు కంగారు పుట్టింది.

కాని అమ్మణ్ణీ, సుబ్బులూ, సత్తీ ఒకచోట కూర్చోడం చూస్తే ఆమెకే ఆశ్చర్యం వేసింది. తొందరగా వెళ్లి అమ్మణ్ణిని తీసుకురావాలని చూసిందిగాని, వాళ్ల ధోరణి చూస్తే ఆమెకే ఒక నిమిషం ఉండి ఏం జరుగుతుందో చూద్దామనిపించింది. పిల్లవాడిపక్కనే సత్తి కూర్చొని వాడడిగిన ప్రశ్నల కేవో సమాధానాలు చెబుతూంది. అమ్మణ్ణి ప్రసాదం తినగా కాళీఅయిన ఒకటిరెండు పోకదొన్నెలు కాలవనీళ్లల్లో పడవల్లా వదులుతూంది. పిల్లవాడు కళ్లు రెప్పలు వెయ్యకుండా అల్లాగే పోకదొన్నెలకేసి చూస్తున్నాడు. వాడికా పోకదొన్నెలు బామ్మచెప్పిన కథలలోని రత్నాల ఓడలు! అవి రంగురంగుల రత్నాలతో సముద్రంమధ్యనున్న రాజకుమార్తెకోసం ప్రయాణమై వెళ్లుతున్నాయి. అవి ఆ పసిహృదయంలో ఇంకా చిత్రమైన ఆకృతులు ధరిస్తున్నాయి. ఇంతలో నరసమ్మ తన పని ముగించుకుని సత్తితో 'రండ్రా వెడదాము' అంది. సుబ్బులు ఆమాటే వినిపించుకోలేదు. చివరి కామె సత్తిచేతుల్లోనించి వాణ్ణి తీసుకోబోతూ 'రా నాయనా వెడదాము' అంది.

'ఉన్నవే నేను లానే.'

'ఏమిరా, ఏమొచ్చిందీ, రా!'

'అమ్మణ్ణక్కా, నేనూ పడవెక్కాలి.' ఈ మాటలు విని నరసమ్మకూడా ఎంతో ఆశ్చర్యపడుతూ 'ఎందుకురా?' అంది.

'తాతగారింటి కెళ్లాలే'

'ఆఁ! మరి పడవేదిరా?'

'అదిగో' అని అప్పుడే బయలుదేరబోతూన్న రెండో పోకదొన్నె చూపించాడు వాడు. ఆమె కళ్లెత్తి ఆ పడవకేసి చూస్తూ 'మీరిద్దరూ ఎక్కితే అది మునిగిపోతుందమ్మా. రా. యింటికెడదాం రా' అంది.

'మునిగిపోతే, నేను రానే' అంటూనే ఆ పిల్లవాడు అక్కా తనూ ప్రయాణం చేదామనుకున్న ఆ ఓడకేసి రెప్పవాల్చకుండా చూశాడు. నరసమ్మ ఇక చీకటి పడుతోందని సత్తిచేతుల్లోంచి పిల్లవాణ్ణి తీసుకుంది. ఆసమయంలో హఠాత్తుగా అమ్మణ్ణికోసం వచ్చిన కనకమ్మ కళ్లూ ఆమెకళ్లూ కలిశాయి. ఆ కళ్లల్లో అంతరాంతరాలల్లో చిన్నిచిన్ని చిరునవ్వులు మెరిశాయి!